అటకెక్కిన హామీలు.. ఆగిన పనులు

- 100 రోజులైనా హామీల అమలును పట్టించుకోని ఎమ్మెల్యే సింధూరరెడ్డి
- కృష్ణా జలాలతో చెరువులు నింపే పనులు ఆగిన వైనం
- బీడుగా బుక్కపట్నం చెరువు ఆయకట్టు
- నెరవేరని పరిశ్రమల ఏర్పాటు హామీ



తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణాజలాలతో నింపేస్తానని ప్రకటించారు. బుక్కపట్నం చెరువును నీటితో నింపి ఆయకట్టును సస్యశ్యామలం చేస్తానని చెప్పారు. మండలాల వారీగా సమస్యలను తెలియజేయడంతోపాటు వాటి పరిష్కారానికి కృషి చేస్తానని సభల్లో ప్రకటించారు. ప్రభుత్వ పథకాల ద్వారా మహిళల జీవితాలను మార్చేస్తానన్నారు. ఉన్నత విద్యావంతురాలు. రాజకీయాల్లో కొత్తయినా చెప్పింది చేస్తుందని ప్రజలు నమ్మారు. ఓట్లు వేసి గెలిపించారు. అయితే వంద రోజుల పాలన పూర్తయినా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చెప్పినా ఏ ఒక్క హామీని అమలు చేయలేదు సరికదా.. గత ప్రభుత్వం ప్రారంభించిన పనులను కూడా ఆపేయించారు.

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినా ఎన్నికల హామీలు అమలుకు నోచుకోలేదు. సభల్లో మాత్రం గెలిపించిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తానని గొప్పగా చెప్పారు. అయితే ఆచరణకు నడుం బిగించడం లేదు. ఈ వంద రోజుల్లో కనీసం ఒక్క అభివృద్ధి పనైనా మొదలు పెట్టలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పుట్టపర్తి నియోజకవర్గంలో కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి, నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు మండలాలు ఉన్నాయి. ఎన్నికల ముందు కూటమి అభ్యర్థిగా పల్లె సింధూరరెడ్డి మండలాల వారీగా తాను ఏం చేయాలనుకున్నారో సభలు పెట్టి మరీ ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలు గురించి పట్టించుకోవడం మానేశారు. దీనిపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

■ ఊసేలేని పరిశ్రమల ఏర్పాటు..

నియోజకవర్గంలో నిరుద్యోగ యువత చాలా మంది ఉన్నారని, పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేసి వారందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే సింధూరరెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే ఏ ఒక్క పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేయించలేకపోయారు. కనీసం సూపర్‌సిక్స్ పథకంలో భాగంగా నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి కూడా ఇవ్వడం లేదు. దీంతో నిరుద్యోగ యువత ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతోంది.

■ 'శోత్రియం' రైతుల నిరీక్షణ..

ఓడీచెరువు మండలం తంగేడుకుంటలో శోత్రియం భూముల రైతులు సమస్యలు తీర్చి అర్హులైన రైతులందరికీ పట్టాలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే సింధూర హామీ ఇచ్చారు. అయితే హామీ అమలు గురించి పట్టించుకోవడం మానేశారు. ఎమ్మెల్యే తమకు పట్టాలు ఎప్పుడు ఇప్పిస్తారా అని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. నల్లమాడ ఎస్సీ కాలనీతోపాటు నియోజకర్గంలోని అన్ని మండలాల్లో సిమెంట్ రోడ్లు వేస్తామని చెప్పినా ఇప్పటికీ హామీ అమలు అతీగతీలేదు.

బ్రిడ్జి గురించి పట్టించుకుంటే ఒట్టు..



బుక్కపట్నం సమీపంలో రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న మరువ వంక(ఫైల్)

బుక్కపట్నం చెరువు నిండితే నల్లనమ్మ గుడి వద్ద మరువ వంక పారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీని కారణంగా బుక్కపట్నం నుంచి పుట్టపర్తి, నల్లమాడ, ముదిగుబ్బ, బుచ్చయ్యగారిపల్లి, ఇతర ప్రాంతాలకు రాకపోకలు బంద్ అవుతాయి. ప్రధానంగా బుక్కపట్నం వాసులు మరువ వంకతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్లగా సమస్య ఉందని, తాను ఎమ్మెల్యే అయిన వెంటనే బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుడతానని పల్లె సింధూర ప్రకటించారు. అయితే వంద రోజులైనా బ్రిడ్జి గురించి మాట మాత్రం కూడా ప్రస్తావించడం లేదు. ఈ విషయంలో ఎమ్మెల్యే తీరుపై బుక్కపట్నం వాసులను నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న బుక్కపట్నం తహసీల్దార్ భవనాన్ని కొత్తగా నిర్మిస్తామని హామీ ఇచ్చినా ఆచరణకు ఉపక్రమించడం లేదు.

హామీల అమలులో విఫలం



ఎమ్మెల్యే సింధూరరెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. ప్రధానంగా గతంలో మేము రూ.864 కోట్లతో నియోజకవర్గంలోని 193 చెరువులు నింపే పనులు ప్రారంభించి ఇందుకు సంబంధించి సామగ్రిని పెద్ద ఎత్తున తీసుకొచ్చాం. ప్రస్తుతం పనులను ఆపేశారు. ఎమ్మెల్యే స్పందించి పనులను త్వరగా పూర్తి చేయించి చెరువులకు కృష్ణా జలాలతో నింపి రైతుల కష్టాలు తీర్చాలి. కూటమి ప్రభుత్వం హామీల అమలు చేయడం చేతగాక వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేయిస్తోంది. అక్రమంగా కేసులు బనాయించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే తాను ఇచ్చిన హామీలను అమలు చేయాలి. అలాగే కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి. లేనిపక్షంలో ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదు.

–దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే

చెరువులకు కృష్ణా జలాలు చేరేనా?



పుట్టపర్తి మండలం చెర్లోపల్లి వద్ద చెరువు నింపే పథకం పనుల కోసం తీసుకొచ్చిన పైపులు

గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గంలోని 193 చెరువులు నింపే పథకానికి శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.864 కోట్లతో పనులు కూడా ప్రారంభించారు. ఈమేరకు చాలా చోట్ల పెద్ద ఎత్తున సామగ్రిని అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ఎన్నికల్లో తనను గెలిపిస్తే చెరువులు నింపే పనులను త్వరితగతిన పూర్తి చేస్తానని ప్రకటించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు ఎక్కడికక్కడ ఆపేశారు. దీంతో ఈ పథకం పూర్తవుతుందో లేదోనని ప్రజలు అనుమానిస్తున్నారు. అలాగే కృష్ణా జలాలతో బుక్కపట్నం చెరువును నింపి ఆయకట్టును సస్యశ్యామం చేస్తానని పల్లె ప్రకటించినా ఒక్క చుక్కనీరు తేలేకపోయారు. ఫలితంగా చెరువు ఆయకట్టు భూములు బీడుగా మారాయి. ఎమ్మెల్యే పల్లె సింధూర తీరుపై రైతులు గుర్రుగా ఉన్నారు.

హామీలు అమలు చేయాలి..



కూటమి ప్రభుత్వం మహిళలను మరోసారి దారుణంగా మోసం చేసింది. 2014 ఎన్నికల్లో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి ఎలా మోసగించారో అందరికీ తెలిసిందే. ఇప్పుడు కూడా ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలకు ద్రోహం చేస్తున్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర ఒక మహిళగా సూపర్‌సిక్స్ హామీలు అమలయ్యేలా చూడాలి. ఇక తాను ఇచ్చిన హామీలను కూడా ఆచరణలో పెట్టాలి.

– పసల తిరుపాలమ్మ, మహిళా సంఘం సభ్యురాలు బుక్కపట్నం.

రైతులను నట్టేట ముంచారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం కింద అందిస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టారు. వంద రోజులు గడిచినా పైసా సాయం అందించలేదు. నమ్మి ఓట్లు వేసిన రైతులను నట్టేట ముంచారు. ఇక ఎమ్మెల్యే పల్లె సింధూర కృష్ణాజలాలతో చెరువులను నింపుతానని ప్రకటించినా ఇంత వరకూ చెరువులకు చుక్కనీరు రాలేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే 193 చెరువులకు నీళ్లు ఇచ్చే పథకాన్ని త్వరగా పూర్తి చేయించాలి.

–ఎంజీ అశ్వర్థనారాయణ, రైతు చిన్నబోయనపల్లి కొత్తచెరువు మండలం

క్లుప్తంగా

సైక్లింగ్‌తో మెరుగైన ఆరోగ్యం



జెండా ఊపి సైక్లింగ్‌ను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

ధర్మవరం అర్బన్: రోజూ సైక్లింగ్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని ధర్మవరం సైక్లింగ్ అండ్ వాకర్స్‌క్లబ్ సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు గోరకాటి పెద్దారెడ్డి తెలిపారు. స్థానిక కాలేజి సర్కిల్‌లో ఆదివారం నిర్వహించిన సైక్లింగ్ కార్యక్రమాన్ని ట్రాఫిక్ ఎస్‌ఐ వెంకటరాముడు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్‌రెడ్డి, బీఎస్‌ఆర్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎర్రగుంట సర్కిల్ వరకు తిరిగి అక్కడ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు సైక్లింగ్ నిర్వహించారు. విద్యార్థులు, యువకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. అనంతరం పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్, సభ్యులు సుజిత్‌కిశోర్, ఓంప్రసాద్, జబీవుల్లా, సురేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ర్యాక్‌ల వితరణ



డిగ్రీ కళాశాలకు పుస్తకాల ర్యాక్‌లను అందిస్తున్న దాతలు

ధర్మవరం అర్బన్: డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి పుస్తకాల ర్యాక్‌లను బోధన, బోధనేతర సిబ్బంది వితరణగా అందించడం హర్షణీయమని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం రూ.28 వేలు విలువ చేసే 7 పెద్ద పుస్తకాల ర్యాక్‌లను ప్రిన్సిపల్ సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ 2021–23 మధ్య కాలంలో కళాశాలలో పనిచేసిన బోధన, బోధనేతర సిబ్బంది ర్యాక్‌లను కళాశాలకు వితరణగా అందించారన్నారు. వివిధ రకాల పోటీపరీక్షల పుస్తకాలు వీటిలో భద్రపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో దాతలు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న కంటి వైద్యుడు నాగేంద్ర

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్యాంపు దాతగా లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు గూడూరు నాగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజగోపాల్ వ్యవహరించారు. శిబిరంలో 82 మందికి కంటి పరీక్షలను చేసి 54 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు కార్యదర్శి ఆకులేటి రమేష్ బాబు, కోశాధికారి ఉలవల నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా ఇప్పటి వరకు దాదాపు 1.50 లక్షల మందికి శస్త్ర చికిత్సలు చేయించామని తెలిపారు. అనంతరం దాతలను శాలువాలతో సన్మానించారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పల్లెం వేణుగోపాల్, మెటికల కుల్లాయప్ప, జి.రాజగోపాల్, గోసే రాధాకృష్ణ, శాగా సురేష్, చందా నాగరాజు, జి.రాధాకృష్ణ, వెంకటేష్‌కుమార్, యజ్ఞన్న, కంటి వైద్యుడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం వలసల దేవర



పూజలందుకున్న వలసల గంగమ్మ

తలుపుల: బండ్లపల్లి పంచాయతీలోని బండ్లపల్లి, పల్లవాండ్లపల్లి, దిగువ బైగారిపల్లి, దిగువ మాలపల్లి, తదితర గ్రామాల ప్రజలు ఆదివారం వర్షం కోసం వలస దేవర కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల సమీపంలోని చింత, మామిడి తోపుల వరకు ప్రజలు ఉత్తర చూసి ఎత్తర గంప అంటూ కాపులు ఊరు వదిలి వెళ్లగా మరికొందరు వారిని ఆపి హస్త కార్తె చూసి అందరం పోదామని పిలుచుకొచ్చారు. ఈ సందర్భంగా పల్లవాండ్లపల్లి సమీపంలో సాయంత్రం వలసల గంగమ్మను తయారు చేసి, ప్రత్యేక పూజలు చేసి వర్షం కురిపించాలని ప్రార్థనలు చేశారు. జరిగింది.

వృద్ధులకు వస్త్రదానం

ధర్మవరం రూరల్: బుక్కపట్నం మండలం యాదాలంకపల్లి గ్రామానికి చెందిన గోనుగుంట్ల నరసింగప్ప వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన కుటుంబ సభ్యులు గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులకు వస్త్రదానం చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న

తాడిమర్రి: రాష్ట్రంలోని వాల్మీకులను (బోయ) ఎస్టీలుగా గుర్తించాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాల్మీకులు ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాల్మీకులు స్థానిక తేరప్పమాన్ సర్కిల్ నుంచి జెడ్పీహెచ్‌ఎస్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పులికొండన్న మాట్లాడారు. వాల్మీకులు విద్య, ఆర్థిక, సామాజికంగా, రాజకీయంగా పూర్తిగా వెనుకబడి ఉన్నారన్నారు. పేదరికంలో మగ్గుతున్న వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని ఎన్నో ఏళ్లగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకులు అందరూ ఐకమత్యంతో పోరాటాలు చేసి ఎస్టీ రిజర్వేషన్‌ను సాధించుకుందామని పిలుపునిచ్చారు. అంతకుముందు సమితి మండల కమిటీని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా తలారి ఓబిలేసు, అధ్యక్షుడిగా చింతకాయల రెడ్డెప్ప, కార్యదర్శిగా పిన్నదరి శంకరయ్య, సలహాదారుగా చింతకాయల కిష్టప్ప, యూత్ ఉపాధ్యక్షుడిగా భూమి సురేష్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సమితి నియోజక వర్గ సోషల్ మీడియా ప్రతినిధి సురేష్, నాయకులు మరవపల్లి లక్ష్మీనరసింహులు, నిడిగల్లు రామాంజి, కునుకుంట్ల వాసు, రాజా తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి



నారాయణ (ఫైల్)

తనకల్లు: మండలంలోని చీకటిమానిపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ నారాయణ (55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. నారాయణ గత కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మాజీ ఎంపీటీసీ మృతదేహానికి పలు పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు



గాయపడిన నారాయణప్ప

ధర్మవరం రూరల్: మండలంలోని సీతారాంపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణప్ప అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. నారాయణప్ప స్వగ్రామమైన కనగానపల్లి మండలం చంద్రాశ్చర్ల నుంచి ద్విచక్ర వాహనంపై ధర్మవరం వెళ్లుతుండగా లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో నారాయణప్ప తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వృద్ధున్ని 108 వాహనంలో ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దకోట్ల చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న చౌడేశ్వరి అమ్మవారు

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు.

3 నుంచి నవరాత్రి ఉత్సవాలు

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్ర స్వామి దేవాలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. ఉత్సవాల నిర్వహణపై ఆదివారం ఆలయ ప్రాంగణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఏడాదిలా కాకుండా ఈసారి ఉత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిద్దామని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చైర్మన్ సూచించారు. సర్పంచ్ ఆదినారాయణ, దేవదాయశాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



గరిశలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్తులు

బత్తలపల్లి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యం బాగుంటుందని ఎంపీడీఓ సాయిమనోహర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామాల్లో ట్యాంకుల వద్ద, రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని పారిశుధ్య కార్మికులతో తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యకర జీవనాన్ని సాగించవచ్చునన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయొద్దని సూచించారు. పంచాయతీల్లో ఆరోగ్య సంరక్షణ సేవలు, బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణకు మందుల పిచికారీ, చెత్త డంపులను తొలగించడం, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం తదితర కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఎస్‌జీవోలకు, పొదుపు సంఘాల మహిళలకు, యువతకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈఓఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీలను మోసగించడంలో చంద్రబాబు దిట్ట



విలేకరులతో మాట్లాడుతున్న గోవిందు

కదిరి అర్బన్: బీసీలను మోసగించడంలో సీఎం చంద్రబాబు దిట్ట అని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంపావతి గోవిందు విమర్శించారు. ఆదివారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 33 శాతం చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని మంత్రి మండలిలో చేసిన తీర్మానం కేంద్రానికి పంపాలని చంద్రబాబు చెప్పడం ఇది మూడో సారి అని గుర్తు చేశారు. చంద్రబాబుకు బీసీలపై నిజమైన ప్రేమ ఉంటే ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో మూడు సార్లు (1999,2004,2009)100కు పైగా ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాల్సి ఉండేదన్నారు. నైపుణ్య గణన చేసి ఆదరణ కింద పనిముట్లు ఇస్తామని, పని చేసుకుని ఓట్లు మాకే వెయ్యండి అన్న తరహాలు బాబు ముందుకెళ్తున్నారని ఎద్దేవా చేశారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, నాయకులు రామచంద్రప్రసాద్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్



పేకాటరాయుళ్లను అరెస్టు చూపుతున్న పోలీసులు

లేపాక్షి: మండలంలోని విబూతిపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరాలపై ఆదివారం చిలమత్తూరు ఎస్‌ఐ మునీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. తమకు వచ్చిన పక్కా సమాచారం మేరకు విబూతిపల్లి శివారులోకి వెళ్లి దాడులు నిర్వహించగా నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా పేకాట నిర్వహిస్తున్న విబూతిపల్లికి చెందిన రామాంజితో పాటు మరో 9 మంది పరారయ్యారని వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న అరవింద్‌గౌడ్

ధర్మవరం: హాకీ ఇండియా ఆధ్వర్యంలో జరగనున్న 14వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనబోయే రాష్ట్ర జట్టుకు పట్టణానికి చెందిన హాకీ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈమేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాష్, జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, టీమ్ మేనేజర్ అరవింద్‌గౌడ్ ఆదివారం తెలిపారు. ఈనెల 23 నుంచి అక్టోబర్ 3 వరకు చండీఘడ్‌లో జరగనున్న 14వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరఫున ధర్మవరం క్రీడాకారులు ఫజులుద్దీన్, శబరీష్‌గౌడ్ పాల్గొంటారన్నారు. క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని వారు ఆకాంక్షించారు.

బారికేడ్లు తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

కదిరి అర్బన్: కుటాగుళ్ల రైల్వే గేట్ ఎడమవైపున ఉన్న రోడ్డుకు వెళ్లకుండా మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలని కుటాగుళ్ల, సైదాపురం రైతులు కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. ఆదివారం రైతులు జహీరుద్దీన్, మస్తాన్‌వలీ, గంగులమ్మ,గంగాదేవి, ఫిర్దోస్ పుట్టపర్తికి చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైపు సుమారు 400 ఎకరాలు వ్యవసాయ భూములు ఉన్నాయన్నారు. ఇక్కడి పంటను వాహనాల్లో పట్టణానికి తరలించేందుకు బారికేడ్లు అడ్డుగా ఉన్నాయన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నేత రమణ

ధర్మవరం: ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్లు అయుబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు ఇవ్వకుండా కార్మికులను వేధిస్తున్నారన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా లక్ష్మిదేవి, కార్యదర్శిగా నాగవేణి, కోశాధికారిగా శ్రీలక్ష్మి, కమిటీ సభ్యులుగా తొమ్మిది మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పాఠశాలల ఆయాల సంఘం నేతలు జయమ్మ, భాగ్యమ్మ, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి



మొటుకుపల్లిలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

కదిరి అర్బన్: కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. మొటుకుపల్లిలో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజుల పాలనలో తమ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. అనంతరం ఇంటింటికీ సంక్షేమ పథకాలకు సంబంధించి కరపత్రాలను అందజేశారు. ఎంపీడీఓ అంజనప్ప, సర్పంచ్ రూపా, మండల అధికారులు పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక వీవర్స్ కాలనీలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కూటమి ప్రభుత్వంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం కాలనీలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కదిరి ఆర్డీఓ సన్నీ వంశీ కృష్ణ, ఎంపీడీఓ శకుంతల, సర్పంచ్ పంచరత్నమ్మ, ఎంపీటీసీ సుమియా పాల్గొన్నారు.